

తిరుపతిలో ఎన్ఐఏ సోదాలు



అడ్వకేట్ క్రాంతి చైతన్య ఇంటిపై సోదాలు నిర్వహిస్తున్న ఎన్ఐఏ అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, తిరుచానూరు: తిరుపతి నగరంలోని ప్రముఖ న్యాయవాది, హక్కుల సంఘం నేత క్రాంతి చైతన్య ఇంట్లో ఎన్ఐఏ పోలీసులు సోమవారం సోదాలు నిర్వహించారు. అహింస నినాదంతో పోరాడిన గాంధీ జయంతి రోజు బడుగు బలహీన వర్గాలకి న్యాయం చేయాలని కోరుతూ వారి పక్షాన నిత్యం కోర్టులో పోరాడుతున్న న్యాయవాది క్రాంతిచైతన్య ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించడం గమనార్హం. తిరుచానూరు యోగిమల్లవరంలోని ఎస్వీపీ కాలనీలోని ఆయన ఇంటి వద్ద సోదరులు నిర్వహించడంతో చుట్టుపక్కల వారు ఆయన అభిమానులు శ్రేయోభిలాషులు అక్కడికి పెద్దఎత్తున చేరుకున్నారు. దీంతో అక్కడ తీవ్రకలకలం చోటుచేసుకుంది. తిరుచానూరుతో పాటు గూడూరు సమీపంలోని బాలయ్యగారిపల్లెలో కూడా ఎన్ఐఏ సోదాలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఏకకాలంలో రెండు చోట్ల ఎన్ఐఏ బందం సోదాలు చేపట్టింది. ఎన్ఐఏ సోదాలతో ఒక్కసారిగా నగర్ ప్రజలు ఉలిక్కిపడ్డారు. నక్సల్స్‌తో సంబంధం ఉన్న వారిపై నిఘా పెట్టిన పోలీసులు, లాయర్ క్రాంతి చైతన్య గతంలో నక్సల్స్ ఉద్యమాల్లో పాల్గొనడంతో సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయన అదుపులోకి తీసుకొని హైదరాబాదుకు తరలించినట్లు సమాచారం. ఎన్ఐఏ సోదాలు దేనికి జరిగాయి, క్రాంతి చైతన్ అరెస్ట్ అయ్యారా లేదా అనే విషయాలు స్థానిక పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

అటవీశాఖ క్లియరెన్స్ ఇస్తేనే 2 గంటల తరువాత

చిన్న పిల్లలకు నడక దారిలో అనుమతి

తిరుమలలో క్యూలైన్లు పరిశీలించిన టీటీడీ చైర్మన్



ప్రజాశక్తి- తిరుమల: అలిపిరి నుంచి తిరుమలకు నడచి వచ్చే మార్గంలో వన్య మగాల నుండి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధవీకరిస్తేనే 12 ఏళ్ళ లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. భక్తుల భద్రతే తమకు ముఖ్యమని ఆయన చెప్పారు. తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో సోమవారం చైర్మన్ క్యూలైన్లను పరిశీలించారు. భక్తులకు ఆహారం, తాగునీరు, కాఫీ, టీ, మజ్జిగ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి చిన్న ఇబ్బంది కలగకుండా మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. గోగర్భం సర్కిల్ నుండి కష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం చైర్మన్ కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడారు. పెరటాశి మాసం, సెలవుల కారణంగా గత నాలుగు రోజులుగా తిరుమలలో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందన్నారు. క్యూలైన్లు 4 నుండి 5 కిలోమీటర్ల దూరం వెళ్లాయని, ఇలాంటి భక్తులకు త్వరిత గతిన స్వామి వారి దర్శనం చేయించాలనే సంకల్పంతో విఐపి బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీ కూడా రద్దు చేసినట్లు చైర్మన్ చెప్పారు. క్యూలైన్లలో ఉండే భక్తులు ఎక్కడా అసహనానికి లోను కాకుండా అవసరమైన తగిన వసతులు కల్పించామని చెప్పారు. అక్టోబరు 15 నుండి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతారనే అంచనాతో అవసరమైన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకుంటుంటున్నామని తెలిపారు.

అధికారుల పనితీరు బ్రహ్మాండం

విపరీత మైన భక్తుల రద్దీ ఉండటంతో ఈవో, జేఈవో, సివిఎస్వో, ఆరోగ్యం ఇతర అధికారులందరూ ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ క్యూలైన్లు పరిశీలిస్తూ బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని చైర్మన్ చెప్పారు. తిరుమలకు భక్తులు పోటెత్తడంతో వీరు ప్రత్యక్షంగా ఏర్పాట్లు పరిశీలిస్తూ భక్తులకు చిన్న ఇబ్బంది కూడా కలక్కుండా పని చేస్తున్నారని చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, ఆరోగ్యాధికారి డాక్టర్ శ్రీదేవి, డిఎఫ్వో శ్రీనివాసులు, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్, డిఎస్పీ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈవో రాజేంద్ర, సిఐలు జగన్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

అను కాలేజీలో పారామెడికల్ కోర్సులకు

ఉపాధి అవకాశాలు మెండు

కళాశాల చైర్మన్ మురళీమోహన్ యాదవ్



ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక తిరుపతిలోని అను ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ కాలేజీలో వివిధ విభాగాలలో పారామెడికల్ కోర్సులు ఉన్నాయని ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు సత్వరమే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అను ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ కళాశాల చైర్మన్, డైరెక్టర్ డాక్టర్ మురళీమోహన్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరంలో తిరుపతిలో పారామెడికల్ రంగంలో అను పారా మెడికల్ సైన్స్ కళాశాలను స్థాపించడం జరిగిందని, దీని ద్వారా ఎంతో మంది నిరుద్యోగులైన వేలాది మంది నిరుద్యోగులకు శానిటరీ ఇన్స్పెక్టర్, హెల్త్‌అసిస్టెంట్, డిఎంఎల్ టి,డిఆర్జిఏ, డిఓఏ, డిఏఎన్, ఎస్డిసిటి, ఆర్‌సిటి కోర్సులు ఇచ్చి ఎంతోమంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల స్థిరపడే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు అతి తక్కువ సమయంలో కూర్చున్న పూర్తిచేసి ఉపాధి అందించే కోర్సులు ఏవైనా ఉన్నాయంటే పారామెడికల్ కోర్స్ లేనని వెల్లడించారు. రెండు సంవత్సరాల కాలవ్యవధిలో డిప్లమా కోర్సులు చేయడం ద్వారా విద్యార్థులకు పారా మెడికల్ రంగంలో ఎంతో పరిజ్ఞానం ఏర్పడి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్, మెడికల్ షాపులలో ఉద్యోగ అవకాశాలు పొందుతారని అన్నారు. ఈ పారామెడికల్ కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి 100 శాతం అవకాశాలు చూపిస్తామని చెప్పారు. ఉన్నత విద్య కోసం దేశ,విదేశాలలో కూడా చదువుకునేందుకు ఇదొక సువర్ణ అవకాశంగా వెల్లడించారు. పారా మెడికల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు గవర్నమెంట్ హాస్పిటల్‌లో, ల్యాబ్స్‌లో, ప్రైవేట్ ల్యాబ్‌లలో, పబ్లిక్ హెల్త్‌డిపార్ట్మెంట్లోనూ, ఎమర్జెన్సీ వైద్యరంగంలోనూ, వైద్య కేంద్రాలలోనూ, ప్రైవేట్ ల్యాబ్‌లలో, రక్త కేంద్రాలు, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్లలో, ఫార్మాసిటికల్ కంపెనీలలో, మెడికల్ ఎక్విప్మెంట్ తయారీ కంపెనీలలో, స్కానింగ్ సెంటర్స్‌లో, ఇతర వైద్యరంగానికి సంబంధించిన సంస్థలలో ఉద్యోగాలు పొందేందుకు అత్యధికంగా అవకాశం ఉందన్నారు. కళాశాలలో అత్యంత అనుభవం కలిగిన ఉన్నతమైన డిగ్రీలు కలిగిన డాక్టరేట్ల కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణంలో తరగతి గదిలలో పారామెడికల్ కోర్సులను విద్యను అందిస్తున్నామన్నారు. ఈకోర్సు విద్యార్థులు చేయడం ద్వారా 100 శాతం జాబ్ గ్యారంటీ ఇస్తున్నామని, బెంగళూరు, చెన్నై, స్థానికంగా ఉన్నటువంటి తిరుపతిలోని వివిధ వైద్య రంగానికి చెందిన సంస్థల ద్వారా ప్రతి ఏటా క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రతివిద్యార్థి కచ్చితంగా సెలెక్ట్ అయ్యే నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను, సబ్జెక్టును పూర్తిగా నేర్పించడం జరుగుతుందన్నారు. తిరుపతిలో పారా మెడికల్ కోర్స్ రంగంలో అతి తక్కువ కోర్సు ఫీజుతో నిరుపేద విద్యార్థులకు అన్ని రకాలైన సౌకర్యవంతంగా హాస్టల్ గదులతో పాటు కళాశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తున్న ఏకైక సంస్థ అను పారామెడికల్ కళాశాల అని అన్నారు. ఇతర వివరాలకు 0877- 2239569, 74164 78392, 74164 78395 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్నెళ్లాగండి మా దెబ్బేంటో చూపిస్తాం

బొజ్జల సుధీర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆర్నెళ్లాగితే వచ్చేది చంద్రన్న ప్రభుత్వమనీ, ఒక్కొక్క వైసీపీ నాయకుడికి మా దెబ్బేంటో రుచి చూపిస్తామని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. టీడీపీ కుటుంబానికి చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి మూలస్తంభాలనీ, జగన్ ఎన్ని కుట్రలు చేసినా వాటిని కదల్చలేరని స్పష్టం చేశారు. గాంధీ జయంతి పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో సత్యాగ్రహ దీక్ష చేపట్టిన సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ భవన్లో సోమవారం టిడిపి నాయకులు మహా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో మా బాధ్యతలు మాకు తెలుసొచ్చాయంటూ జగన్‌కు కతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో నారా లోకేష్ అరెస్టు కానున్నాడనీ, నన్నూ అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయనీ, అయినా భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. చంద్రబాబును, లోకేష్ ను, సుధీర్‌ను అరెస్టు చేసినా వెయ్యిమంది బాబులు, లోకేష్‌లు, సుధీర్‌లు పుట్టుకోస్తారనీ, జగన్ భరతం పడతారంటూ హెచ్చరించారు. శ్రీకాళహస్తిలో బియ్యపు రాక్షస పాలన సాగుతోందనీ, తనపై, తన కార్యకర్తలపై వందల సంఖ్యలో అక్రమకేసులు బనాయించరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ నేతల చేత ఉచ్చ పోయిస్తామనీ, బయటకు రావాలంటే వణికిపోయేలా చేస్తామంటూ హెచ్చరించారు. బొజ్జల రిషితా రెడ్డి, చక్రాల ఉషాతో పాటు పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు రిలే దీక్షలో పాల్గొన్నారు.


గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర

ప్రజాశక్తి- తిరుమల

స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగంచేసిన మహాత్మా గాంధీ లాంటి నాయకుల అడుగుజాడల్లో అందరూ నడవాలని టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర కోరారు. టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ స్ఫూర్తితో టీటీడీ ఉద్యోగులు మరింత అంకితభావంతో భక్తులకు సౌకర్యాల కల్పనే పరమావధిగా సేవలందించాలని కోరారు. విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి యాజమాన్యానికి అండగా నిలబడడం సంతోషకరమన్నారు. సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవోలు స్నేహలత, గుణభూషణ్ రెడ్డి, గోవిందరాజన్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో విసి ఆధ్వర్యంలో



తిరుపతి ఎస్వీయూలో..

క్యాంపస్: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఎస్వీయూలో ప్రధాన గ్రంథాలయం ఎదుట ఉన్న గాంధీజీ విగ్రహానికి విసి ఆచార్య కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసీ మెంబర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం, సిడిసి డీన్, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అప్పారావు, లైబ్రరీ ఇంచార్జ్ ఆచార్య సురేంద్రబాబు పాల్గొన్నారు.

తిరుపతిలోని సంక్షేమ హాస్టల్‌లో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఇంచార్జ్ డాక్టర్ జి.శారద, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు.

శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.


రేణిగుంట: సోమవారం మహాత్ముని 154వ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో మహాత్ముని చిత్రపటానికి సర్పంచ్ నగేషం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ సుజాత, వార్డు మెంబర్ ఖాదర్ ఖాన్, కష్ణమూర్తి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బజారు వీధి, బస్టాండ్ పరిసరాల్లో పంచాయతీ కార్మికులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. అలాగే గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీఆర్ రావణన్ ప్రజలకు స్వీట్లును పంపిణీ చేశారు.

అమరవీరుల ట్రిబ్యూట్ వాల్ శంకుస్థాపన



ప్రజాశక్తి- తిరుచానూరు: శిల్పారామంలో గాంధీ జయంతిని పురస్కరించికొని స్వాతంత్ర్య పోరాటంలో అమరవీరుల ట్రిబ్యూట్ వాల్‌కు రాష్ట్ర మంత్రి ఆర్‌కే.రోజా, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పాండిచ్చేరి స్పీకర్ సెల్వం, ఎంపీలు గురుమూర్తి, రెడ్డప్ప, కలెక్టర్ వెంకట రమణరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ దేశం మొత్తం మీద 75చోట్ల నిర్మాణం చేయాలని ప్రధాని చక్రవిజన్ ఫౌండేషన్ కోరిక మేరకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏపి లో మూడు చోట్ల ట్రిబ్యూట్‌వాల్ నిర్మాణం చేస్తున్నామన్నారు. తిరుపతిలోని శిల్పారామంలో నిర్మాణం ప్రారంభించామన్నారు. మహనీయుల గొప్పతనం గురించి స్మరించుకునేలా ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. దేశ భక్తులకు గుడి లాంటిది ట్రిబ్యూట్ వాల్ అని ఆమె పేర్కొన్నారు. దీనిని ప్రతి జిల్లా లో యువత, విద్యార్థులు సందర్శించాలిని కొరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



గూడూరు టౌన్‌లో..

గూడూరు టౌన్: గాంధీ జయంతి, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బజారువీధిలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, 50 మందికి దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ సెక్రటరీ శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, సోమిశెట్టి, చెంచురామయ్య, మదనమేటి రమణయ్య, జగదీష్ చంద్ర, రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.



రేణిగుంటలో..

నాయుడుపేట: గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీ పార్కులో కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు మహాత్మకి గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జలదంకి వెంకటకష్ణారెడ్డి, మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, ఏఎంసి చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, చదలవాడ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కటకం జయరామయ్య, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతిలో

తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్, డాక్టర్ వైయస్సార్ ప్రజాప్రస్థానం సేవ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పేదలకు వస్త్ర, అన్నదానం నిర్మించారు. స్థానిక క్రైమ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గాంధీ భవన్ వద్ద మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గాంధీభవన్ కార్యదర్శి వెంకటరమణ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, మాజీ ఎంపీ జానేంద్ర రెడ్డి, అజయ్ కుమార్, డాక్టర్ రెడ్డప్ప, బండి మధుసూదన్, కార్పొరేటర్ ఆదిలక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

మహాత్మా విగ్రహానికి టిడిపి వినతి

పుత్తూరు టౌన్: గాంధీజయంతి సందర్భంగా పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో టిడిపి కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి చంద్రబాబు నాయుడుని అక్రమకేసులో నిర్బంధించారంటూ వినతిపత్రాన్ని సమర్పించారు.కౌన్సిలర్లు ఎన్.మణెమ్మ, జి.జీవరత్నం, రాధా అశోక్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బి.ఆర్.యుగంధర్, మాజీ వైస్ ఛైర్మన్ డిఎస్.గణేష్ పాల్గొన్నారు.

ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభించిన కలెక్టర్



తిరుపతి (మంగళం): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్, సంస్కార్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి బస్టాండు వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి ప్రారంభించారు. టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ప్రదర్శనను ఆసక్తిగా పరిశీలించారు. ఇందులో గాంధీజీ బాల్యం, విద్యాభ్యాసం, కుటుంబ వివరాలు, దక్షిణాఫ్రికా విషయాలు, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు తదితర ఛాయాచిత్రాలు ఆసక్తికరంగా ఉన్నాయని పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావును అభినందించారు. సంస్కార్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజేష్, పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యదర్శి డి.చంద్రమోహన్, వైస్ చైర్మన్ చంద్రమోహన్ రావు, మాజీ చైర్మన్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ హర్షవర్ధన్ రెడ్డి, సభ్యులు వివి.సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



గూడూరులో జర్నలిస్టులు

గూడూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస చారి, మహబూబ్ బాషా, అహ్మద్ భాయ్, రాదయ్య, మునికుమార్ బజారువీధిలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని వద్ధాశ్రమంలో మండలి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని స్వీపర్లకు ఆంధ్రమహిళ మండలి ఇన్నర్ వీలర్ క్లబ్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు.

మంగళంలో గాంధీ జయంతి వేడుకలు

తిరుపతి (మంగళం): గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామ పంచాయతీలో పంచాయతీ సర్పంచ్ లీలావతి లక్ష్మీనారాయణ, అధ్యక్షులు రజాక్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీని చేపట్టారు. సప్తగిరికాలనీ పంచాయతీలో ఇన్ చార్జి అశోక్ కుమార్ రెడ్డి, అధక్షులు మహమ్మద్ ఖాసిం ఆధ్వర్యంలో సచివాలయం ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. సీఐ శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డిల అధ్వర్యంలో ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, చిట్టిబాబు, గోపి, వినోద్, వెంకటేష్, హరిబాబు గాంధీకి నివాళి అర్పించారు.

గూడూరు: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలో గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దీక్షను కొనసాగించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాస రావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, దువ్వూరు మధురెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో గూడూరులో సోమవారం 'సేవ్ జర్నలిజం డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయుడబ్ల్యూజే ప్రతినిధి షేక్ జమాలల్లా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చిరువెళ్ల సునీల్ కుమార్, శ్రీపతి, రమేష్ బాబులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.



ఓటేరులో..

తిరుపతి రూరల్ మండలం ఓటేరు గ్రామంలోని గాంధీ విగ్రహానికి స్థానిక నాయకులు ఎం.సూర్య కిరణ్, రాజా, మౌళి, ఇస్మాయిల్, పద్మనాభ రెడ్డి, ముని పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బాలాయపల్లి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెందుటి కార్తీక్ రెడ్డి జయంపు గ్రామంలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెందోటి కార్తీక్ రెడ్డి యువసేన పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి బాలం యుగంధర్ రెడ్డి, ఎంపిడిఓ దేవేంద్రర్ బాబు, తహశీల్దార్ లోకేశ్వరి, ఎంఈవో సత్యనారాయణ, సాయిరాం స్కూల్ జనార్ధన్‌రెడ్డి, గీతాంజలి స్కూల్ గిరి కుమార్‌రెడ్డి, నారాయణ స్కూల్ మోహన్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



పుత్తూరులో..



సిఐటియూ ఆధ్వర్యంలో టాటా మ్యాజిక్ ఆటోలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్న ఆటోకార్మికులు

టాటా మ్యాజిక్ ఆటోలకు రవాణా సౌకర్యం కల్పించాలి: సిఐటియూ

ప్రజాశక్తి - కోట : టాటా మ్యాజిక్ ఆటోల్లో కూడా ప్రయాణీకులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోట సిఐటియూ ఆటో కార్మిక సంఘం కార్మికులు సోమవారం కోట ఎస్ఐ పుల్లారావు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు బివి. రమణయ్య, ఆటో కార్మిక సంఘం కార్మికులు మాట్లాడుతూ విద్యానగర్ బస్టాండ్ ప్రాంతంలోని సెంటర్లో తమ టాటా మ్యాజిక్ ఆటోలు నిలుపుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికే టాటా మ్యాజిక్ ఆటోలపై ఆధారపడి తమ కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. తమ టాటా మ్యాజిక్ ఆటోలను బస్టాండ్ వద్ద ప్రయాణీకులను ఎక్కించుకునే స్థానిక ఆటో వాళ్లు బలవంతంగా దించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా టాటా మ్యాజిక్ ఆటో నిలిపేందుకు కొద్దిపాటి పార్కింగ్ స్థలం చూపాలన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగు న్యాయం జరిగేలా చూడాలని సిఐటియూ ఆటో కార్మిక సంఘం కార్మికులు కోట ఎస్ఐ పుల్లారావు ని ప్రాధేయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం స్థానిక అధ్యక్షులు గోపీనాథ్, కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సిహెచ్ సుధాకర్, మండల సిఐటియూ నాయకులు హరినాథ్, రమణయ్య, టాటా మ్యాజిక్ ఆటో రమేష్, మణి, క్రాంతి, పవన్, మహష్, గౌరి మోహన్ పాల్గొన్నారు.

ఈవో మృతికి పలువురి సంతాపం



ఆలయ ఈవో మునిక్రిష్ణయ్య (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర ఆలయం, వడమాల పేట సదాశివ కోన, తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయ ఈవో మునిక్రిష్ణయ్య మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడు తున్నారు. ఇటీవల స్విమ్స్ హాస్పిటల్ లో చేరిన ఆయన చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన మృతి పై ఆలయ చైర్మన్ కొడగండి రమేష్ బాబు, జయ చంద్ర, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ అనిల్ హరి, శివాలయ మాజీ చైర్మన్ జలకం సునీల్ కుమార్ పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రిటైర్డ్ పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ రవీంద్ర కుమార్ మృతి బాధాకరం..



రవీంద్ర కుమార్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రిటైర్డ్ పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ రవీంద్ర కుమార్ మృతి బాధాకరమని పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్, డిఈఈ కె.వి రవీంద్ర కుమార్, పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ డివిజన్ని ఇంజనీర్ల సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో రవీంద్ర కుమార్ గూడూరు పంచాయతీరాజ్ డివిజన్ నందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేసి ప్రమోషన్ మీద అనంతపురంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ గా పనిచేసి రిటైర్ అయ్యారన్నారు. ఆయన అనారోగ్య సమస్యలతో బెంగుళూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరం అన్నారు. గూడూరులో పని చేసేటప్పుడు వారు మంచి ఆఫీసర్ గా కార్యదీక్షకునిగా గూడూర్ డివిజన్ పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధికి పనుల మంజూరులో ఎనలేని సేవనందించారని వారి మృతి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'సేవ్ జర్నలిజం- సేవ్ డెమోక్రసీ'



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్నజర్నలిస్టులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజాస్వామ్యానికి నాలుగో మూల స్తంభమైన జర్నలిజం నేడు తీవ్ర ప్రమాదంలో పడిందనీ, సామాజిక బాధ్యత కోసం పని చేయాల్సిన జర్నలిజం పెట్టుబడిదారీ వ్యవస్థ చేతిలో కీలు బొమ్మగా మారిపో యిందంటూ పలువురు సీనియర్ పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 'సేవ్ జర్నలిజం డే' ను నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని తేరు వీధిలోని మహాత్ముడి విగ్రహానికి పాత్రికేయులు నివాళి అర్పించారు. అనంతరం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాత్ముడికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు మాట్లాడు తూ పాత్రికేయుల పట్ల పాలకులు చిన్న చూపు చూస్తు న్నారన్నారు. నిత్యం సమాజం కోసం పని చేసే పాత్రికేయుల కనీస హక్కులను రక్షించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని వాపోయారు. అడ్డగోలు నిబంధ నల కారణంగా అక్రిడిటేషన్ల జారీ అరకొరగా మారిందని దాదా పు పన్నెండు వేలమంది అర్హులైన జర్నలిస్టులు అక్రిడిటేష న్ లు పొందలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు, ప్రమాద బీమా పథకం పూర్తిగా అటకెక్కిందన్నారు. జర్నలిస్టు లకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల ప్రత్యేక పథకం ఇంకా ఆచరణలోకి రాలేదన్నారు. జర్నలిస్టులపై దాడులు జరుగు తున్నాయనీ, భద్రతకు ప్రత్యేక చట్టం చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షు లు కామేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ పాత్రికేయు లు రహంతుల్లా, రమణ, శ్రీరాములు, ఈశ్వరయ్య, అంకయ్య, వీసీ వెంకటయ్య, హరీష్, మెహర్, ముని కృష్ణారెడ్డి, కోటేశ్వర బాబు, ముని మోహన్, హరి ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

ఏపీ భవిష్యత్తును అక్రమ రిమాండ్ పేరుతో జైల్లో పెట్టారు..



ప్రజాశక్తి- చిట్టమూరు: ఇంటింటికి బాబుతో నేను కరపత్రాల పంపిణీలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నాగార్జున గూడూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు, చిట్టమూరు మండల టీడీపీ అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు సూచనల మేరకు గూడూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, మహాజన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లసిరి నాగార్జున ఈశ్వర వాకలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్షతో చంద్రబాబు నాయుడు గారు ను అక్రమ రిమాండ్ పేరుతో ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్ట్ చేసి ఇన్ని రోజులు జైల్లో పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం అన్నారు. అవినీతికి పాల్పడిన జగన్ మోహన్ రెడ్డి పది సంవత్సరాల నుండి బెయిల్ పై బయట ఉన్నారని, ఏ తప్పు చేయని చంద్రబాబును జైల్లో పెట్టడం ఈ ప్రభుత్వం కక్ష సాధింపు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు , బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో మైనార్టీ సోదరులు వైసిపి తీర్థం



మంత్రి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి -చౌడేపల్లి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మండలానికి చెందిన మైనార్టీ సోదరులు వైసిపిలో చేరారు. చౌడేపల్లి మండలం 29ఏ చింతమాకులపల్లి పంచాయతీ ఖాన్సాబ్ మిట్టకు చెందిన టిడిపి నాయకుడు నూరుల్లా అతని అనుచరులు కుటుంబ సభ్యులు 30 మందితో తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా మైనార్టీల అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టి ఆ ఫలాలు నేరుగా వారి ఇళ్ళకే చేరే విధంగా కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. వైసిపిలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని రాబోయే కాలంలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పెద్దపీట వేస్తామన్నారు. అంతకు ముందు చౌడేపల్లి నుంచి వచ్చిన అ నాయకులతో ఆయన జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి వైసిపి అధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్, హెచ్డిఎఫ్సి చైర్మన్ కళ్యాణ్ భరత్, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ ,సర్పంచులు శ్రీరామ్ భరత్ వరుణ్, షంషీర్, హైమావతి, రవికుమార్ రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ సాదిక్ అజీజుల, రషీదా బేగం, రాధాపతి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గుడిపల్లి: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గుడుపల్లి మండలం చిన్న గొల్లపల్లి పంచాయతీ పెద్దగొల్లపల్లి గ్రామంలో సుమారు 130 మందికి ఉచితంగా వైద్యం చేస్తూ అలాగే మెడిసిన్ లు సరఫరా చేశారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి ఒక గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, గ్రామానికి విచ్చేసిన వైద్య బృందానికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు . వైద్యానికి వచ్చిన రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు అన్నదానం గ్రామస్తుల సహాయంతో ఏర్పాటు చేశారు.



వైసిపి మండల అధ్యక్షులు కె చలపతి రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

వైసిపి మండల అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కీళ్లపూడి గ్రామంలోని గజ సింగరాజపురం గ్రామస్తులు వైసిపి మండల అధ్యక్షులుగా ఎన్నికైన కె చలపతి రాజును ఘనంగా సన్మానించారు. చలపతి రాజు మాట్లాడుతూ ఈ గ్రామంలో వైసిపిపై ఎక్కువ మంది మక్కువ చూపడం చాలా సంతోషం అన్నారు. ఈ గ్రామంలో సోమవారం పాండియన్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమం గ్రామం మొత్తం కలిసి వచ్చి తనను సన్మానించడం చాలా సంతోషంగా వుందన్నారు. గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులు తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ రమేష్ రాజు, మోహన్, సుబ్రహ్మణ్యం, త్యాగరాజులు, మోహన్ రెడ్డి, బాబు,గోపి ఎలుమలై, రత్నం, నాగూరు పాల్గొన్నారు.



అశోక్ రెడ్డి కి జ్ఞాపిక అందిస్తున్న చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తిరుపతి అర్బన్ డిప్యూటీ తాహశీల్దార్ మిట్టపల్లి అశోక్ రెడ్డి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియ మితు లయ్యారు. ఈ మేరకు విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అసోసియేషన్‌కు నూతన కార్యదర్శిగా ఎన్నికైన అశోక్ రెడ్డిని రెవెన్యూ శాఖ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు అశోక్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జగనన్న సురక్ష : ఎంపిడిఓ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరుగుతుందని ఇన్చార్జి ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం మండలంలోని తంబుగానిపల్లి సచివాలయం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఇప్పటికే గ్రామంలో గడపగడపకు సర్వే చేపట్టి అనారోగ్యంగా ఉండే వారిని గుర్తించామని వారికి ఉచితంగా అన్ని పరీక్షలు చేపట్టి, తగిన మందులు పంపిణీ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు గ్రామస్తులు ఈ కార్యక్రమం ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేసే ప్రయత్నం

బాధితుల ఆవేదన

ప్రజాశక్తి -గంగవరం: తమ భూమిని ఫోర్జరీ సంతకాలతో కాజేసే ప్రయత్నం చేసినందుకు అడిగితే తమపైకే దౌర్జన్యానికి పాల్పడుతు న్నారని గంగవరం మండలం దిగువ వేమనపల్లి గ్రామానికి చెందిన బాధితులు శంకరమ్మ, వెంకటమ్మ, మునెమ్మ సోమవారం జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు..సర్వేనెంబర్ 881/1 లో 1,4 సెంట్లు 1030/1లో 4.96 ఎకరాలు తమ మామ కంచన్న పై రెవెన్యూ రికార్డులలో నమోదైన భూమిలో అదే గ్రామానికి చెందిన లేట్ వెంకటరమణ భార్య మంగమ్మ ఫోర్జరీ సంతకాలతో తమ భూమిని 3. 75 సెంట్లు ఆన్లైన్లో నమోదు చేసుకున్నారని ఈ విషయాన్ని గమనించిన తాము గంగవరం తహశీల్దారు కి తెలియపరచగా ఆయన పరిశీలించి పొరపాటు జరిగిందని ఆన్లైన్లో వారి పేరును రద్దుచేసి తమ పేరు నమోదు చేసి న్యాయం చేశారన్నారు. అయినప్పటికీ మంగమ్మ కుటుంబీ కులు ప్రతిరోజు తమ పైకి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రికార్డులు సక్రమంగా ఉన్నందు వల్ల న్యాయస్థానం ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని అయినా వారి దౌర్జన్యాలు ఆగలేదన్నారు. మంగమ్మ కుటుంబీకులు తమను చంపేస్తారోనని భయంతో గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారి నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని సంబంధిత అధికారులు స్పందించి రెవెన్యూ రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

తలకోన జలపాతంలో పడి యువకుడు మృతి



మృతుడు శైలేష్

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ప్రముఖ పర్యాటక కేంద్రమైన తలకోన జలపాతంలో ప్రమాద వశాత్తు యువకుడు కాలు జారి నీటి మడు గులో పడటంతో ఊపి రాడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు కు చెందిన శైలేష్ (24) హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. శైలేష్ తన ఆరుగురు స్నేహితులతో కలిసి తిరుమ ల కు వెళ్లి దర్శనం చేసుకుని అనంతరం సోమవారం సరదాగా తలకోనకు విచ్చేశాడు. జలపాతంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మడుగులో పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు అతని స్నేహితులు తెలిపారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని తల్లి దండ్రులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

పేకాట స్థావరంపై మెరుపు దాడులు

- రూ.51000 నగదు స్వాధీనం
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

ప్రజాశక్తి- గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని కుందకూరు లోని కొండ కింద గట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గూడూరు రూరల్ ఎస్ఐ బ్రహ్మనాయుడు తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై సోమవారం మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 51 వేల రూపాయల నగదును ఎస్ఐ బ్రహ్మనాయుడు వారి సిబ్బందితో కలిసిపట్టు కున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ జూదం ఆడినా, ప్రోత్సహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. జూదం ఆడడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. ఎక్కడైనా జూదం ఆడినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందజేయాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని రూరల్ ఎస్ఐ బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది శ్రీను విష్ణు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉపాధి హామీ సిబ్బంది

ఉపాధి సిబ్బంది గ్రామ సభ

ప్రజాశక్తి -సోమల: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఉపాధి హామీ పథకం సిబ్బంది పలుచోట్ల గ్రామ సభలను నిర్వహించి ఉపాధి హామీ 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై గ్రామ సభలో ప్రజలకు తెలిపారు. నంజంపేట సచివాలయం నందు నిర్వహించిన గ్రామసభలో ఏపీవో దినకర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పనుల గుర్తింపు కేటాయింపు వుంటుందని మండలంలోని రైతులు కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, కార్యదర్శి సబితా, ఉప సర్పంచ్ ముబారక్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

దళిత గిరిజన మహిళలపై దాడులు అడ్డుకోవాలి..

- నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- భారత రాజ్యాంగాన్ని రక్షించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పిలుపు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి -పలమనేరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చిత్తూరు జిల్లా కమిటీ సమావేశం పట్టణం లోని సీఐటీయూ కార్యాలయం లో సోమవారం జిల్లా అధ్యక్షురాలు చిరంజీవమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరై రాష్ట్ర కర్తవ్యాలను, రాజకీయ పరిస్థితులను వివరించారు. ఈ సమావేశంలో నాలుగు అంశాల పైన చర్చించి కర్తవ్యాలను నిర్ణయించారు. కర్తవ్యాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబుల్ రాజు కమిటీ ముందు ప్రతిపాదించి ఆమోదం పొందారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దళితులపై, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలపై మహిళాపై దాడులు రోజురోజుకూ పెరిగిపోయి ఈ వర్గాలకు దేశంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా చలో ఢిల్లీ కార్యక్రమం డిసెంబర్ 4న చేపట్టాలని నిర్ణయించారన్నారు. నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలోనూ సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించారు. నరేంద్ర మోడీ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న రాష్ట్రంలో వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ ప్రజా వ్యతిరేక విధానాల్లో పాలుపంచుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. అంతే కాకుండా ఉపాధి హామీ నిధులు దారి మళ్లించి ఉపాధి కూలీల కడుపు కొడుతున్న జగన్మోహన్ రెడ్డి వెంటనే ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందని అందుకు నిదర్శనం బడ్జెట్లో కేటాయింపులు తగ్గించడం మనం గమనించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు డిసెంబర్ 4న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ'లో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొని తమ నిరసన గళాన్ని నరేంద్ర మోడీ గూబ గుయ్యిమనేలా నినదించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని రాష్ట్ర చరిత్రలో ఇన్ని సార్లు 144 సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైసిపి జగన్మోహన్ రెడ్డి దని అని తెలిపారు. డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమానికి గ్రామాల నుండి ప్రజలను చైతన్యపరిచి డిసెంబర్ 4న ఢిల్లీ నడిరోడ్డు పైన లక్షలాదిమంది ప్రజలతో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీని జగన్మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, నింద్ర, పెద్దపంజాణి, తదితర పది మండలాల నుండి మండల నాయకత్వం జలపతి వీరభద్రప్ప, వెంకటేష్, ఉన్నామలై, సుబ్రహ్మణ్యం, కొండప్ప, పాకాల సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, మురుగేష్, బాలసుబ్రమణ్యం , వేనప్ప, గణేషు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వియూలోని అర్థశాస్త్ర కోర్సుతో ఉన్నత అవకాశాలు మెండు

- విభాగాధిపతి ఆచార్య ఆర్ సునీత



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని 2023-24 విద్యాసంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అర్థశాస్త్రంలో ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని విభాగాధిపతి ఆచార్య ఆర్.సునీత పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ 2023 లో ఆర్థిక శాస్త్రంలో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సదుపాయాలతో పాటు మంచి ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఎస్వియూ లోని ఆర్థిక శాస్త్రంలో విభాగానికి ప్రత్యేకంగా గ్రంథాలయం ఉందని , విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులో 50 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో 45 సీట్లు, సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులో 40 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఐదు సీట్లు ఉంటాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యముతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు, సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రంథాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగానికి ప్రత్యేకమైన అర్థశాస్త్ర పుస్తకాలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే యుజిసి నెట్, రాష్ట్ర స్థాయిలోనే స్లేట్, సివిల్ సర్వీస్ పరీక్షలు ఐఆర్ఎస్, ఐఏఎస్, ఐపీఎస్, ఆర్బిఐ, నాబార్డ్ వంటి సంస్థలలోని వివిధ ఉద్యోగాలకు ఆర్థిక శాస్త్రమే కొలమానం, ప్రామాణికం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే గ్రూప్ 1 నోటిఫికేషన్ లలో కానీ, గ్రూప్ 2, గ్రూప్ 3, సచివాలయం ఉద్యోగాలు, ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలలో ఆర్థిక శాస్త్రం ప్రధాన భాగంగా ఉంటుందని వివరించారు. ఆర్థిక శాస్త్రంలో పీజీ కోర్సు చేసిన తర్వాత విద్యార్థులకు ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ, ఇంటర్, న్యాయవిద్య కళాశాలలో ఆర్థిక శాస్త్రం బోధించడానికి మంచి అవకాశాలుం టాయన్నారు. ఒక్క ఎంబిబిఎస్ కోర్సులో తప్ప మిగిలిన అన్ని కోర్సులలో ఉదాహరణకు ఇంజినీరింగ్, ఎంబీఏ, అగ్రికల్చర్, వెటర్నరీ వంటి పలు కోర్సులలో కూడా ఆర్థిక శాస్త్రం ఒక సబ్జెక్టుగా ఉంటుందన్నారు. విదేశాలలో కూడా ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆర్థిక శాస్త్రం పీజీ చేసిన విద్యార్థులకు ఎన్నో ఉన్నతమైన అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. విద్యార్థులు యూనివర్సిటీలోని అన్ని రకాల సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఆర్థిక శాస్త్రం కోర్సుతో మంచి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 పరీక్షలో రాసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎస్వీయూలోనే ఆర్థిక శాస్త్రంలో చేరేందుకు మంచి అవకాశం ఉందని, అవకాశాల్ని సద్విని యోగం చేసుకోవాలని సూచిం చారు. ప్రతి సెమిస్టర్ లోనూ విద్యార్థులకు అవగాహన తరగతులతో పాటు, దేశంలోని వివిధ విశ్వవి ద్యాలయాల్లో బ్యాంకింగ్ రంగంలో, ఆర్థిక శాస్త్ర రంగంలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధ కులు, రచయితలచే ప్రత్యేక మైన తరగతులు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన విశ్లేషణాత్మకమైన ప్రశ్నలు, వాటికి సంబంధించిన జవాబులతో పాటు వివిధ కోచింగ్ సెంటర్లు అందించే మెటీరియల్ కు సంబంధించి అంశాల పై విశ్లేషణ, చర్చలు విద్యార్థులకు అందిస్తారన్నారు. ఎస్వీయులోని ఆర్థిక శాస్త్ర విభాగంలో పీజీ కోర్సు చేసిన విద్యార్థులకు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉపాధి అవకాశాలు అద్భుతంగా ఉన్నాయని సూచించారు.